క్లుప్తంగా

స్వామి వారి సేవలో ఎమ్మెల్యే



ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు

అనంతగిరి: వికారాబాద్ అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామిని సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కుల్కచర్ల: ఈ నెల 26న చౌడాపూర్ మండల కేంద్రం అనుబంధ గ్రామమైన బూరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్ రెడ్డి, బుడగ జంగం మండల అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు బంధయ్య, అంబేడ్కర్ సంఘాల మండల అధ్యక్షుడు పరిగి అశోక్, ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు రాజశేఖర్, నర్సింహులు, యాదయ్య, కృష్ణయ్య, శివకుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్, రాజు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం



ఖలీద్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఏ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఖలీద్ అలీఖాన్ బదిలీపై సైబరాబాద్‌కు వెళ్లారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కోటిరెడ్డి, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఖలీద్ అందించిన సేవలను ఎస్పీ కొనియాడారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం..



చెక్కు అందజేస్తున్న పార్టీ నాయకులు

యాలాల: కార్యకర్తలకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమయ్య అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మహిళా కార్యకర్త సోనుబాయి మృతి చెందగా.. పార్టీ పాలసీ బీమా రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆరీఫ్ హుస్సేన్, దేవనూరు ఖాసిం, రూప్‌సింగ్, శంకర్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లను పర్మినెంట్ చేయాలి



పోస్టుకార్డులతో జేపీఎస్‌లు

దౌల్తాబాద్: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు రాసి పంపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ జేపీఎస్‌లను మూడేళ్ల తర్వాత పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం .. నాలుగేళ్లు పూర్తవుతున్నా నేటికీ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తమను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలి



విరాళం అందజేస్తున్న యాదయ్య గౌడ్

దోమ: ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుండగా.. సోమవారం అభిషేకాలు, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి.. కల్యాణ మహోత్సవానికి.. గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌తో రూ.11 వేల విరాళం పంపగా.. ఆయన అందజేశారు. ఎంపీటీసీ అనిత గౌడ్, గ్రామస్తులు హన్మయ్య, రాములు పాల్గొన్నారు.

ఉపాధి ఫుల్.. వసతులు నిల్

- నిలువనీడ లేదు.. వేసవి భత్యం లేదు
- చెట్లనీడే కూలీలకు ఆధారం
- హాజరు తీసుకునే వరకు ఎండలోనే నిరీక్షణ



ఎన్కేపల్లిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మోమిన్‌పేట: పని ముగిసిన తర్వాత చెట్ల కిందే సేద తీరాలి. హాజరు తీసుకునే వరకు వేచి ఉండాలి. చెట్లు లేని చోట మండుటెండలోనే నిరీక్షించాలి. నిలువనీడ లేదు, వేసవి భత్యం లేదు. తప్పనిసరిగా ఉదయం 11గంటల వరకు పని దగ్గర ఉండాల్సిందే. ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం)ద్వారా ఒక్కో గ్రూపు సభ్యులను ఫొటోతో సహా హాజరు తీసుకునే వరకు కూలీలు వేచి ఉండాల్సిందే. ఉపాధిహామీ పథకంలో నిబంధనల ప్రకారం రోజు కొలతలు తీస్తే రూ.272 ఉండేది. గతంలో 30శాతం వేసవి భత్యం చెల్లిస్తే అదనంగా రూ.82 అందేవి. కానీ అవేవీ లేకుండా కూలీలకు కేవలం రూ.272లు కూలి చెల్లిస్తున్నారు.

టార్పాలిన్ షీట్లు లేవు..

గతంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వేసవిలో కూలీల నీడకోసం ఒక్కో శ్రమశక్తి సంఘానికి టార్పాలిన్ షీట్లు పథకంలో భాగంగా పంపిణీ చేసేవారు. గ్రూపు మేట్ రోజు పని ప్రదేశానికి తీసుకు వచ్చి నీడను కల్పించేంది. ప్రస్తుతం చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు.

ఎన్ఐసీ ద్వారా..

దేశంలో ఉపాధి కూలీల హాజర్‌ను ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ఎంఎంఎస్ ద్వారా ఫొటోతో సహా నేషనల్ ఇన్ఫర్ మేటిక్ సెంటర్‌కు పంపుతారు. దీంతో అక్కడి నుంచి హాజరు అయిన కూలీల డబ్బులు.. కొలతల వారీగా వారి ఖాతాల్లో జమచేస్తారు. మండల పరిధిలోని 28గ్రామ పంచాయతీలలో రోజుకు 5వేల మందికి పైగానే కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. నీడ కొరకు టార్పాలిన్ షీట్లు, వేసవి భత్యం ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.

“ ప్రతి మూడేళ్లకు..



మూడు సంవత్సరాలకు ఒకసారి కూలీల నీడ కొరకు టార్పాలిన్ షీట్లు పింపిణీ చేసేవారు. ఇప్పుడు అలాంటివి రావడం లేదు. పై నుంచి వస్తే పంపిణీ చేస్తాం. వేసవి భత్యం కూడా రావడం లేదు. రోజుకు రూ.272లు కూలి ఇస్తున్నాం.

– శంకర్, ఏపీఓ, మోమిన్‌పేట

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- మండల అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కరుణ

బషీరాబాద్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని బషీరాబాద్ ఎంపీపీ కరుణ అన్నారు. మండల అభివృద్ధికి సమష్టిగా నిధులు వస్తున్నాయని, కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని, అదే విధంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు కృషి చేయాలని సూచించారు.

బిల్లులు ఎప్పుడు వస్తాయి?

ఈజీఎస్‌లో చేసిన పనులకు బిల్లులు ఎప్పుడు వస్తాయని సర్పంచులు ఎంపీడీఓను ప్రశ్నించారు. అప్పులు చేసి పనులు చేస్తుంటే చెక్కులు పాసవడం లేదని వాపోయారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని, త్వరగా బిల్లులు వచ్చేలా చూడాలని కోరారు. మాసన్‌పల్లిలో ఐకేపీ అధికారులు డ్వాక్రా మహిళల నుంచి రుణాలు కట్టించుకొని, కొత్త రుణాలు ఇవ్వకుండా సతాయిస్తున్నారని సర్పంచ్ భీమప్ప ఎంపీఎం పద్మారావుతో వాగ్వాదానికి దిగారు. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ.. వారికి ఏం చేస్తున్నారని ప్రశ్నించగా.. ఎంపీపీ కరుణ కల్పించుకొని కొత్త రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ సమస్యలపై పలువురు సంబంధిత అధికారులను నిలదీశారు. గాలి వీస్తే కరెంటు పోతుందని, ఫోన్‌లు చేసినా ఎవరూ స్పందించరని పలువురు సభ్యులు ఆరోపించగా.. అధికారులు ప్రజాప్రతినిధుల ఫోన్లకు స్పందించాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, ఎంపీడీఓ రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

నిధులు లేక పడరాని పాట్లు



కలెక్టర్ కార్యాలయం వద్ద సర్పంచ్‌లు

కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి: సర్పంచ్‌లు

యాలాల: పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మండల సర్పంచ్‌లు కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఫైనాన్స్ నిధులతో పాటు రాష్ట్ర నిధులు గతేడాది నుంచి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్‌లు భీమప్ప, మధుసూదన్‌రెడ్డి, శేఖర్, సాయిలు, శివకుమార్, పటేల్‌రెడ్డి, బసిరెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీకి సన్నాహాలు

- రెండో విడతలో 11,512 మందికి లబ్ధి
- డీడీలు చెల్లించిన వారికి అందజేత
- రూ.1.75లక్షలకు పెరిగిన యూనిట్ ధర



దౌల్తాబాద్: జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. తొలివిడతలో గుర్తించిన వారందరికీ యూనిట్ల పంపిణీ చేయకముందే పథకం నిలిచిపోయింది. అప్పుడు మిగిలిన వారితో పాటు తాజాగా గుర్తించిన వారందరికీ పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాలో 11,320 యూనిట్లు

జిల్లాలోని 20 మండలాల్లో 11,320 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. తొలి విడతలో 11,904 యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో 11,512 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. నామినీలు తమ సొసైటీ తీర్మానాలను పశువైద్యాధికారులకు అందజేసి, పేరు మార్పిడి చేసుకొని యూనిట్ పొందే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2017లో ప్రారంభించగా.. తొలి విడతలో డీడీలు చెల్లించి గొర్రెలు రాని వారితో పాటు ఇప్పుడు గుర్తించిన అర్హులందరికీ యూనిట్లు అందజేస్తామని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం యూనిట్ ధర పెరగడంతో లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ..

తొలివిడతలో గొర్రెల పంపిణీ పక్కదారి పట్టిందని, రీసైక్లింగ్ జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో క్షేత్రస్థాయిలో 30శాతం గొర్రెలు కనిపించడం లేదన్న విమర్శలు మిన్నంటాయి. వీటిపై ప్రభుత్వానికి ఫిర్యాదులూ అందాయి. దీంతో రెండో విడతను పక్కాగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పెరిగిన ధర...

గతంలో గొర్రెల (20 గొర్రెలు, ఒక పొట్టేలు) యూనిట్ ధర రూ.1.25 లక్షలు ఉండగా.. ఇప్పుడు రూ.1.75లక్షలకు పెరిగింది. అప్పుడు లబ్ధిదారుల వాటా రూ.31,250 చెల్లించగా.. ఇప్పుడు రూ.43,750 చెల్లించాల్సి ఉంటుంది. తొలివిడతలో డీడీలు చెల్లించి యూనిట్లు పొందని వారు పెరిగిన వాటాధనం డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంది.

“ చర్యలు తీసుకుంటున్నాం

రెండో విడత గొర్రెల (యూనిట్ల) పంపిణీకి సన్నాహాలు చేస్తున్నాం. డిమాండ్ డ్రాఫ్ తీయని వారు తక్షణమే డీడీ తీయాలని చెబుతున్నాం. అక్రమాలకు తావులేకుండా.. లబ్ధిదారులందరికీ అందేలా చర్యలు తీసుకుంటాం. లక్ష్యం మేరకు పక్కా ప్రణాళికతో పంపిణీ చేస్తాం.

– అనిల్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈర్లవాగుతండాలో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి జబ్బులు ఉన్నవారు నేత్ర శిబిరంలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’లో చిన్నారులకు చికిత్స అందించాలి

పరిగి: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఫాతిమాసుల్తాన్ అన్నారు. మండల పరిధిలోని సయ్యద్‌మల్కాపూర్ గ్రామంలో సోమవారం నేత్ర శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని, కానీ ప్రభుత్వం కేవలం 18 సంవత్సరాలు నిండిన వారికే అనడం సరికాదన్నారు. కంటి సమస్యలు 12ఏళ్ల పిల్లలకు కూడా వస్తాయని, కావున పదేళ్ల వయస్సు ఉన్న వారికి కూడా చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌తో వంటగ్యాస్ సరఫరా



గ్యాస్ పైప్‌లైన్ ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

మోమిన్‌పేట: అవసరమైన వారికి ఇంటికే వంట గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇక సిలిండర్‌తో పని లేదని, వంట గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా మెఘా కంపెనీ ఇంటింటికీ సరఫరా చేస్తుందని ఆయన చెప్పారు. మీటరు బిగించడం వలన ఎంత గ్యాస్ ఉపయోగిస్తే అంత బిల్లు వస్తుందన్నారు. కావున గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటింటికీ పైప్‌లైన్ తీసుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కార్యదర్శి నర్సింహులు, సంస్థ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మపరిరక్షణకు శంకరాచార్యుల కృషి అమోఘం

కుల్కచర్ల: సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించడంలో ఆది శంకరాచార్యులు విశేష కృషి చేశారని, భవిష్యత్ తరాలకు విలువైన సూచనలు చేశారని ఆధ్యాత్మిక వేత్త రఘోత్తమ ఆర్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శంకరాచార్యుల జయంత్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ఏకీకృతం చేసిన భారతీయ తత్వవేత్త ఆది శంకరాచార్యులను పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు చిన్నయ్యచారి, రాఘవేంద్రచారి, పతంజలి రమేశాచార్యులు, వెంకటయ్యచారి, రఘుచారి, విశ్వేంద్రచారి, వినోద్‌చారి, రాఘవేందర్ చారి, ఆంజనేయులుచారి, రవిచారి, వెంకటేశ్‌చారి, రాములుచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వేత్త

సంక్షిప్త వార్తలు

• కష్టపడి చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పండరి

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని మల్కాపూర్ గనికార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ పండరి అన్నారు. సోమవారం మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగప్ప, ఉప సర్పంచ్ మజీద్, ఎస్ఎంసీ చైర్మన్ అల్లావుద్దీన్, నాయకులు కాశీనాథ్, మహేష్ బాబు ఉన్నారు.

• రోడ్డు పనులు ప్రారంభం

మర్పల్లి: పిల్లిగుండ్ల గ్రామంలో వ్యవసాయ పొలాల వద్దకు రైతులు, వాహనాలు వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం కింద ఫార్మేషన్ రోడ్డును సర్పంచ్ పాండుతో కలిసి ఎంపీడీఓ రాజ్ మల్లయ్య ప్రారంభించారు.

• కుక్కల బెడదను నివారించండి

తాండూరు రూరల్: తాండూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం అంతారంకు చెందిన ముస్తఫా రిజ్వాన్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు

• బీసీల డిమాండ్లు నెరవేర్చాలి

కొడంగల్: బీసీలు సంఘటితం అయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని కొడంగల్ నియోజకవర్గం జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు మన్నె బస్వరాజు అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో బీసీలు సగభాగం ఉన్నారని, అధికారంలో ఉన్న పెత్తందారులు బీసీలను ఏకం కాకుండా చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

• బాలల పరిరక్షణలో చొరవ చూపండి



మహిళా సంఘాల ప్రతినిధులకు సూచనలు చేస్తున్న డీపీఎం రామ్మూర్తి

కుల్కచర్ల: బాలల హక్కుల పరిరక్షణలో మహిళా సంఘాల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని డీపీఎం రామ్మూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలని సూచించారు.

• ప్లీనరీని జయప్రదం చేయాలి

అనంతగిరి: వికారాబాద్‌లో మంగళవారం జరిగే నియోజకవర్గ స్థాయి ప్లీనరీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ప్లీనరి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, వార్డుల్లో ఉదయం 7గంటల నుంచి 8గంటల లోపు పార్టీ జెండా ఆవిష్కరణలు ముగించుకొని, 9గంటల లోపు ప్లీనరీకి రావాలని సూచించారు.

• సచిన్‌లా ఎదగాలి



కేక్‌కట్ చేస్తున్న రూరల్ సీఐ రాంబాబు

తాండూరు టౌన్: ప్రతి క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్‌లా ఎదగాలని తాండూరు రూరల్ సీఐ రాంబాబు ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని సెయింట్ మార్క్స్ గ్రౌండ్‌లో సహారా క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టెండూల్కర్ బర్త్‌డే వేడుకలను నిర్వహించారు.

• సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న సీఐ అప్పయ్య

బంట్వారం: సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగ పడతాయని ధారూరు సీఐ అప్పయ్య అన్నారు. కోట్‌పల్లి మండల పరిధిలోని లింగంపల్లిలో పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు.

• ఈత సరదా విషాదం కారాదు

కొడంగల్: ఈత సరదా విషాదం కాకూడదని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను వేసవి సెలవుల్లో జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. బావులు, చెరువులు, కాలువలు, కుంటల దగ్గరకు పంపరాదని సూచించారు. సర్పంచులు వారి గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. సెలవులు ఉండటం వలన పిల్లలు ఇష్టాను సారంగా తిరుగుతుంటారని, ఎండ వేడిమి నుంచి వారిని కాపాడుకోవాలని పేర్కొన్నారు. పిల్లలకు ఈత, వాహనాలు నేర్పించాలనుకుంటే.. వారి వెంట తల్లిదండ్రులు ఉండాలని సూచించారు. పోలీసుల సలహాలు సూచనలు పాటించాలని ఎస్ఐ కోరారు.

ప్రాధాన్యతగా సమస్యల పరిష్కారం

ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు



వికారాబాద్ అర్బన్: ఫిర్యాదులు తీసుకుంటున్న కమిషనర్ శరత్‌చంద్ర



దౌల్తాబాద్: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. సోమవారం మున్సిపల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి పది ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా శానిటేషన్, పట్టణ ప్రణాళిక విభాగంలో ఫిర్యాదులు ఉన్నాయన్నారు. తక్షణం వాటి పరిష్కారం కోసం ఆయా విభాగాల అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ చెప్పారు. నిధులతో కూడిన సమస్య తమ పరిధిలో నిదైతే వెంటనే పరిష్కరిస్తున్నామని, మిగతా సమస్యలను నోట్ చేసుకొని కౌన్సిల్ ఆమోదంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

దోమ: ప్రజావాణిలో రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తహసీల్దార్ షాహెదాబేగం చెప్పారు. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతుల నుంచి భూ సమస్యల ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని వినియోగించుకోండి

దౌల్తాబాద్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కృష్ణయ్య చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని, మరికొన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ చాంద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు నిల్

బంట్వారం: ప్రజావాణికి బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని, భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్ రసూల్ తెలిపారు. ఇప్పటి వరకు ధరణికి సంబంధించిన అర్జీలే ఎక్కువగా వచ్చాయని చెప్పారు. రికార్డులు సరిచూసి ధరణిలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని రైతులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.